ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు

ట్రాఫిక్ అదనపు డీసీపీ వేణుగోపాల్‌రెడ్డి



జెక్‌కాలనీ ప్రతినిధులతో మాట్లాడుతున్న అదనపు డీసీపీ వేణుగోపాల్‌రెడ్డి

సనత్‌నగర్: ఎర్రగడ్డ సంతకు వచ్చేవారి సంఖ్య అంతకంతకూ పెరుగుతోందని, సనత్‌నగర్ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులతో పాటు నివాసితులకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ట్రాఫిక్ అదనపు డీసీపీ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు, ఇన్‌స్పెక్టర్ నిగిడాల సురేష్, ఇతర సిబ్బందితో కలిసి వేణుగోపాల్‌రెడ్డి ఎర్రగడ్డ సంతను పర్యవేక్షించారు. అనంతరం జెక్‌కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ ఫెడరేషన్ ప్రతినిధులతో సమావేశమై మాట్లాడారు. కోర్టు, మానవ హక్కుల కమిషన్ ఉత్తర్వుల మేరకు కమిషనర్ ఆదేశాలతో ఎర్రగడ్డ సంత వ్యాపారులను జెక్‌కాలనీలోకి రాకుండా నియంత్రించగలిగామన్నారు. ఎర్రగడ్డ సంకొచ్చే వచ్చే కొనుగోలు, విక్రయదారులతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందని వాహనదారులతో పాటు సనత్‌నగర్ నివాసిత ప్రాంత ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో సనత్‌నగర్ ప్రధాన మార్గంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించి నివేదిక తయారుచేసి ప్రభుత్వానికి అందజేయనున్నట్లు చెప్పారు. సంతకు తాము వ్యతిరేకం కాదని, ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయం ఏర్పాట్లు చేయాలన్నదే తమ అభిప్రాయమని జెక్‌కాలనీ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెక్‌కాలనీ అధ్యక్షుడు మల్లు ప్రసాద్, రాజశేఖర్‌చందు, ప్రతినిధులు అనంతరెడ్డి, విశ్వనాథరాజు, కంజర్ల సదాశివయాదవ్, సోమ వెంకట్, పూర్మానీ మల్లారెడ్డి, నాగిరెడ్డి, రాజా, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



స్థానికులతో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్ శ్రీకాంత్

హఫీజ్‌పేట్: తమ దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ స్పష్టం చేశారు. హఫీజ్‌పేట్‌లోని 'కేఎస్‌ఆర్ టుగెదర్‌మెంట్స్, అపార్ట్‌మెంట్స్ అసోసియేషన్' ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అపార్ట్‌మెంట్ వాసులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కేఎస్‌ఆర్ టు గెదర్‌మెంట్ అపార్ట్‌మెంట్స్ ఇబ్బందులు, సమస్యలను పరిగణనలోకి తీసుకుని పరిష్కరించేందుకు చొరవ తీసుకుంటామన్నారు. పార్కు, మౌలిక వసతులు, తాగునీటి సమస్య, విద్యుత్ దీపాల సమస్యలను కూడా పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా అపార్ట్‌మెంట్ వాసులు మంజీరా తాగునీటి సమస్యను తీర్చాలని, బిల్డర్ పేరు చెప్పి ప్రైవేటు వ్యక్తులు వచ్చి ఇబ్బందులకు గురిచేస్తూ.. మనశ్శాంతి లేకుండా చేస్తున్నారన్నారు. దీంతో పలు సమస్యలను వారు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ప్రతి సమస్య పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు బాలింగ్ గౌతమ్‌గౌడ్, నాయకులు, అపార్ట్‌మెంట్ వాసులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

రాయదుర్గం: జీవనశైలి, వాతావరణంలోని మార్పులతోనే వ్యాధులు వస్తున్నాయని వైద్యాధికారులు తహజబీన్, తేజస్వి, సుమన్ అన్నారు. నానక్‌రాంగూడ స్టార్ ఆస్పత్రి, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్తాధ్వర్యంలో శారద హైస్కూల్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆరోగ్యమే మహాభాగ్యమని అంటారని, అందువల్ల కొన్ని జాగ్రత్తలు తీసుకున్నచో మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంటుందన్నారు. ప్రతినిత్యం వ్యాయామం, మెడిటేషన్, యోగ, ధ్యానం, నడక కనీసం 40 నిమిషాలు చేయాలని సూచించారు. సాధ్యమైనంతవరకు తాజా ఆకు కూరలు, సీజనల్ పండ్లు, పాలు, పాల ఉత్పత్తులు, చేపలు,గుడ్లు, తృణధాన్యాలు, డ్రైఫ్రూట్స్ వంటి పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. సాధ్యమైనంతవరకు ఆల్కహాల్, పొగాకు, ఇతర మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. అనారోగ్యంపై శ్రద్ధ చూపుతూ.. వైద్యుల సూచనలు, సలహాలను విధిగా పాటించాలన్నారు. ఈ సందర్భంగా 105 మందికి ఎత్తు, బరువు, రక్తపోటు, షుగర్, పల్స్, కంటి, దంత, బీఎండీ పరీక్షలతో పాటు ఈసీజీ పరీక్షను నిర్వహించారు. అనంతరం శ్రీ నేత్రాలయ కంటి వైద్యశాల ఆధ్వర్యంలో కంటి వైద్య పరీక్షలను చేశారు. స్కూల్ కరస్పాండెంట్ బంద నరేంద్ర బాబు, సభ్యులు అన్నయ్య చౌదరి, వాణిసాంబ శివరావు, సుబ్రహ్మణ్యం, కామేశ్వరరావు, రాజుగౌడ్, ఆస్పత్రి ప్రతినిధి జాకీర్ హుస్సేన్, స్టార్ ఆస్పత్రి, నేత్రాలయ వైద్య సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.



శారద స్కూల్‌లో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

పేదలకు అందుబాటులో వైద్య సేవలు



వైద్య శిబిరంలో వలంటీర్లకు జ్ఞాపికను అందిస్తున్న నిర్వాహకులు

గచ్చిబౌలి: పేదలకు వైద్య సేవలను అందించేందుకు గచ్చిబౌలిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో స్వేచ్ఛ, కేర్ అండ్ కేరీర్ చారిటీ, ఎస్‌వీకే సంస్థలు సంయుక్తంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్లు పేదలకు వైద్య సేవలను అందించారు. గచ్చిబౌలి పరిసరాల్లోని స్లమ్ ఏరియా ప్రజలే కాకుండా నగర శివారులోని వారు కూడా రైళ్లలో వచ్చి వైద్య సేవలను పొందడం విశేషం. ఈ సందర్భంగా పలువురు వైద్య సేవలను అందిస్తూ.. ప్రజలకు తగిన సలహాలు, సూచనలు కూడా ఇచ్చారు. ఆరోగ్యంపై ఎలా శ్రద్ధ తీసుకోవాలో వివరించారు. అనంతరం నిర్వాహకులు వైద్య శిబిరంలో సేవలందించిన డాక్టర్లు, వాలంటీర్లుగా పనిచేసిన వారికి మెమొంటోను అందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. ఇప్పటి వరకు 9వేల మందికి పైగా వైద్య సేవలు అందించగా కంటి ఆపరేషన్లను 100 మందికి చేయడం విశేషం, ఇప్పటి వరకు 50 మంది వైద్యులు, వందలాదిమంది వలంటీర్లుగా రెగ్యులర్‌గా పాల్గొంటున్నారన్నారు.

మళ్లీ ఎన్నికల బదిలీలు..!

- పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన ప్రక్రియలు పూర్తి చేయాలని ఎన్నికల సంఘం ఆదేశాలు
- మూడేళ్ల సర్వీసు పూర్తయిన పంచాయతీ రాజ్, జెడ్పీ, డీఆర్‌డీఏ ఉద్యోగుల బదిలీపై చర్చ
- ఎంపీడీఓలకు కూడా ట్రాన్స్‌ఫర్లు తప్పవని సమాచారం
- బదిలీపై శివారు జిల్లాల అధికార యంత్రాంగం కసరత్తు

సాక్షి,మేడ్చల్ జిల్లా: ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం అధికారుల బదిలీలకు మరోసారి రంగం సిద్ధమవుతోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న రెవెన్యూ, పోలీసు, పంచాయతీ రాజ్ విభాగాల్లో బదిలీలు జరిగాయి. మరో వైపు సర్వీసుతో సంబంధం లేకుండా సొంత జిల్లాలో వివిధ ప్రభుత్వ విభాగాల్లో పనిచేస్తున్న అధికారులు కూడా బదిలీ అయ్యారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మరోసారి అధికారుల బదిలీల అంశం తెరపైకి వచ్చింది. కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అన్ని పనులు పూర్తి చేసుకుని సిద్ధంగా ఉండాలని సూచించడంతో... బదిలీల ప్రక్రియను వేగవంతం చేసేందుకు అధికార యంత్రాంగం సమాచారాన్ని సేకరిస్తోంది. అందులో భాగంగానే జిల్లా పంచాయతీ, జిల్లా పరిషత్, డీఆర్డీఏ విభాగాల్లో పనిచేస్తున్న జిల్లా అధికారులతో పాటు మరికొన్ని విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు బదిలీ అయ్యే అవకాశాలు ఉన్నాయని రెవెన్యూ శాఖ వర్గాల్లో చర్చ సాగుతోంది. సదరు అధికారుల స్వస్థలం, ఎన్ని సంవత్సరాలుగా మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో పనిచేస్తున్నారు. ఉద్యోగ విరమణకు దగ్గరగా ఎవరైనా ఉన్నారా? లాంటి వివరాలను సేకరించి తుది నిర్ణయం తీసుకోనున్నారు.

మినహాయింపు దక్కేనా..

కలెక్టరేట్‌లలోని వివిధ విభాగాలకు పర్యవేక్షకులుగా తహసీల్దార్లు పనిచేస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా కొందరు బదిలీపై ఇక్కడి వచ్చారు. ఇక జిల్లాల్లో ఆయా మండలాల్లో ఇతర జిల్లాల నుంచి వచ్చిన వారు బాధ్యతల్లో కొనసాగుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో మండల అభివృద్ధి అధికారులు (ఎంపీడీవో)లకు పోలింగ్ నిర్వహణలో ప్రత్యక్ష ప్రమేయం ఉండే అవకాశాలు లేకపోవడంతో వీరికి బదిలీల నుంచి మినహాయింపు లభించింది. కానీ సొంత జిల్లా, మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఎంపీడీవోలను కూడా ఈ దఫా బదిలీ చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. ఎన్నికల నిర్వహణలో అనుభవజ్ఞులైన అధికారుల అవసరం ఉంటుందన్న కారణంగా జిల్లాల్లో కొంత మంది అధికారులకు మినహాయింపు కూడా దక్కవచ్చని అధికార వర్గాల్లో చర్చ జరుగుతోంది.

తల్లిదండ్రులకు పాదపూజ



తల్లిదండ్రులకు పాదపూజ చేస్తున్న విద్యార్థిని

మోతీనగర్: విద్యార్థులు ఏ స్థాయిలో ఉన్నా జన్మనిచ్చిన తల్లిదండ్రులను.. విద్య నేర్పించిన గురువులను మరవకూడదని శ్రీసాయి చైతన్య టెక్నో హైస్కూల్ చైర్మన్ ఎం. శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం అల్లాపూర్ డివిజన్ శ్రీవివేకానందనగర్ డివిజన్‌లోని శ్రీ సాయి చైతన్య టెక్నో హైస్కూల్ 10వ తరగతి విద్యార్థులు తల్లిదండ్రులకు మహా పాదపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంతోమంది నేడు తల్లిదండ్రులను వృద్ధాశ్రమాల్లో ఉంచటంతో వారు మనోవేదనకు గురవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్స్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

కింది కుంట చెరువును అభివృద్ధి చేస్తా



ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని కలిసిన వాకర్స్ కమిటీ సభ్యులు

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని కిందికుంట చెరువుకు చేపట్టవలసిన అభివృద్ధి పనులపై ఆదివారం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీతో వాకర్స్ కమిటీ సభ్యులు చర్చించారు. కింది కుంట చెరువును అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు.

అవంతినగర్ తోట అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు విజయం



మోతీనగర్: అవంతినగర్ తోటను నియోజకవర్గంలోనే ఆదర్శకాలనీగా తీర్చిదిద్దుతానని సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా గెలుపొందిన జి.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఆదివారం మూసాపేట డివిజన్ అవంతినగర్ తోట కమ్యూనిటీహాల్‌లో సంక్షేమ సంఘం అధ్యక్ష ఎన్నికలు జరిగాయి. అధ్యక్ష బరిలో ఇద్దరు అభ్యర్థులు పోటీలో ఉండగా సమీప అభ్యర్థి కె.గోపాల్ చౌదరిపై జి.వెంకటేశ్వర్లు గెలుపొందారని ఎన్నికల అధికారుల కె. కృష్ణ, దత్తాత్రేయులు తెలిపారు. అధ్యక్షుడిగా గెలుపొందిన జి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న కమ్యూనిటీహాల్‌ని మినీ ఫంక్షన్‌హాల్‌గా తీర్చిదిద్దామన్నారు. కాలనీలో ఉన్న దేవాలయాన్ని దాతల సహకారంతో నిత్యం ఆధ్యాత్మికత వెల్లివిరిసేలా కృషి చేస్తామని తెలిపారు. కాలనీలో ఉన్న పలు సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తామని తెలిపారు.తన విజయానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

వీకర్ సెక్షన్ సంఘం అధ్యక్షుడిగా జబ్బర్‌ఖాన్



మోతీనగర్: మూసాపేట డివిజన్ పాండురంగ నగర్ వీకర్ సెక్షన్ సంఘం అధ్యక్ష ఎన్నికల్లో ఆదివారం స్థానిక కమ్యూనిటీహాల్‌లో నిర్వహించారు. అధ్యక్ష పరిధిలో ఇద్దరు అభ్యర్థులు పోటీలో ఉండగా సమీప అభ్యర్థి మహేందర్ యాదవ్‌పై జబ్బర్‌ఖాన్ 35 ఓట్ల మెజార్టీతో గెలుపొందారని ఎన్నికల అధికారి వీరమల్లు అశోక్ తెలిపారు. అ సందర్భంగా అధ్యక్షుడిగా ఎన్నికైన జబ్బర్ ఖాన్ మాట్లాడుతూ.. తాను గతంలో చేసిన అభివృద్ధి పనులే తన విజయానికి దోహదం చేశాయని తెలిపారు. రాబోయే రోజుల్లో పాండురంగ నగర్ వీకర్ సెక్షన్‌ను ఆదర్శ కాలనీగా తీర్చిదిద్దడానికి తన శాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు. తన విజయానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

చేనేత జౌళి శాఖ ఉద్యోగుల నిరసన

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ చేనేత జౌళి శాఖ ముఖ్య అధికారి తీరుపై ఆ శాఖ ఉద్యోగులు గళమెత్తారు. ఉద్యోగుల పట్ల వ్యవహరిస్తున్న అణచివేత ధోరణిని తీవ్రంగా వ్యతిరేకించారు. తమ సమస్యల మీద దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. శాఖలో ఉన్న ఉద్యోగుల సమస్యలు, హెచ్‌అండ్ టీ శాఖ పరిధిలోని టీఎస్‌సీఓ సంస్థ సమస్యలపై చర్చించి, వాటి పరిష్కారాల కోసం కృషి చేయాలని కోరారు. బషీర్ బాగ్‌లోని సెంట్రల్ అసోసియేషన్ కార్యాలయంలో తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ చేనేత– జౌళి శాఖ ఫోరం ఉద్యోగులు, అధికారులు పెద్ద సంఖ్యలో హాజరై కొత్త రాష్ట్ర కార్యవర్గంను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కొన్ని తీర్మానాలను ఆమోదించారు. ఈ సమావేశంలో తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్, సెంట్రల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ జి.నిర్మల, సెక్రటరీ జనరల్ యాకుబ్ పాషా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రంజిత్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎంకే రాజు, చేనేత–జౌళి శాఖ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కేటీ చారి, రాష్ట్ర జనరల్ సెక్రటరీ, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన ర్యాలీ



బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న రంగారెడ్డి జిల్లా ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ ప్రవీణ్‌రావు

రంగారెడ్డి జిల్లా ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ ప్రవీణ్‌రావు

గచ్చిబౌలి: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వాడకంపై మరింత అవగాహన అవసరమని రంగారెడ్డి జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారి ఎం.ప్రవీణ్‌రావు పేర్కొన్నారు. ఆదివారం గచ్చిబౌలి స్టేడియం వద్ద రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా అవగాహన బైక్ ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల్లో మరణించిన వారిలో 80 శాతం మంది ద్విచక్ర వాహనదారులే ఉంటున్నారన్నారు. హెల్మెట్ ధరించకపోవడంతోనే ప్రమాదాల్లో మరణిస్తున్నట్లు లెక్కల్లో స్పష్టమవుతుందన్నారు. కొందరు హెల్మెట్ ధరించినా బెల్టు లాక్ చేయకపోవడంతో ప్రాణాలు కోల్పోతున్నారని పేర్కొన్నారు. మితి మీరిన వేగంతో వాహనాలను నడపడం సరికాదన్నారు. మద్యం మత్తులో, సెల్‌ఫోన్ మాట్లాడుతూ.. వాహనాలు నడిపితే ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నిబంధనలను పాటించాల్సిన అవసరం ఉందన్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ప్రజల సహకారం అవసరమని ఆయన చెప్పారు. కొండాపూర్ ఆర్టీఏ కార్యాలయం వరకు అవగాహన ర్యాలీ కొనసాగింది. ఎంవీఐలు విజయరావు, వాసు తదితరులు పాల్గొన్నారు.

ఆర్పీఎఫ్ పోలీసులపై చర్యలు తీసుకోవాలి

హిమాయత్‌నగర్: దళిత బహుజన పార్టీ(డీబీపీ) జాతీయ ఉపాధ్యక్షుడు సి.యాదగిరిపై నాంపల్లి రైల్వే స్టేషన్ వద్ద దాడికి పాల్పడిన నాంపల్లి రైల్వే పోలీసులపై చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు, సుప్రీం కోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణ స్వరూప్ రైల్వే డిమాండ్ చేశారు. ఆదివారం హిమాయత్‌నగర్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బాధితుడు ఎఫ్‌సీఐ రిటైర్డ్ అధికారి, సీనియర్ సిటిజన్ అయిన సి.యాదగిరి నాంపల్లి స్టేషన్ వద్ద తన వాహనం పార్కింగ్ చేసిన వద్దకు వచ్చారన్నారు. ఈ క్రమంలో ఆర్‌పీఎఫ్ పోలీస్ కానిస్టేబుల్ వచ్చి దౌర్జన్యం చేసి, గల్లా పట్టుకొని దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దాడికి పాల్పడ్డ వారిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలిజాల ప్రవీణ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నక్కా దేవేందరరావు, పెండ్యాల సుచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న భరతనాట్య ప్రదర్శన



శిల్పారామంలో నాట్య ప్రదర్శన చేస్తున్న దృశ్యం

శిల్పారామంలో నిర్వహిస్తున్న 'నేషనల్ హ్యాండ్లూమ్ ఎక్స్‌పో' గాంధీ బుణాకర్ మేళా నిర్వహించారు. ఈ మేళాలో భాగంగా ఆదివారం పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. నృత్యాంజలి స్కూల్ ఆఫ్ డాన్స్ నాట్య గురువు శృతికిరణ్ శిష్య బృందం చేసిన భరతనాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. పుష్పాంజలి, అలరిపు, మూషికవాహన, మహాగణపతి, గణేశపంచరత్న తదితర అంశాలను కళాకారులు అనన్య, ఆద్య, నిత్యశ్రీ, వంశిక, తన్వీ, రియా, శ్రీయ, శాన్వి, పూర్వి, పవిత్ర, హిరణ్య, మహతి, మైత్రి తదితరులు పాల్గొని ప్రదర్శించారు. ప్రముఖ నాట్య గురువులు హరి మంగ ళంపల్లి, మృదుల ఆనంద్, వైదేహీ సుభాష్, ప్రముఖ సంగీత కళాకారులు నేపథ్య గాయని శ్రీనిధి తిరుమల పాల్గొని కళాకారులను అభినందించారు. మాదాపూర్

కులగణనపై మాజీ డీజీపీ వ్యాఖ్యలు అర్థరహితం

ఉస్మానియా యూనివర్సిటీ: కుల గణన విదేశీ శక్తుల ఏజెండా అని ఏపీలో కులగణనపై మాజీ డీజీపీ అరవిందరావు చేసిన వ్యాఖ్యలు అర్థరహితమని బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని రంగాల్లో బీసీలు అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్ కుల గణనకు శ్రీకారం చుట్టారన్నారు. కులగణను వ్యతిరేకిస్తూ వ్యాఖ్యానించడం దారుణమని సామాజిక న్యాయం, విద్య, ఉద్యోగ అవకాశాలు, ప్రభుత్వ పథకాల పంపిణీ, రిజర్వేషన్ల పెంపు తదితర అంశాలకు కులగణన ఎంతో దోహదపడుతుందన్నారు. ఐఏఎస్, ఐపీఎస్ లాంటి ఉన్నత విద్యావంతులు కులగణనకు వ్యతిరేకంగా మాట్లాడటంవారి విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు.

ఓయూ అభివృద్ధికి కృషిచేస్తా

త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి

ఉస్మానియా యూనివర్సిటీ: త్రిపుర గవర్నర్, ఓయూ పూర్వ విద్యార్థి నల్లు ఇంద్రాసేనారెడ్డిని యూనివర్సిటీలో ఘనంగా సన్మానించారు. ఆదివారం ఓయూ క్యాంపస్ దూరవిద్య కేంద్రం ఆడిటోరియంలో వీసీ ప్రొ.రవీందర్ అధ్యక్షత ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉస్మానియా ఫౌండేషన్, ఓయూ పూర్వవిద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ఇంద్రాసేనారెడ్డిని సన్మానించి ప్రశంస పత్రాన్ని అందజేశారు. ఓయూ అభివృద్ధికి తన వంతు సహకారం చేయనున్నట్లు ఈ సందర్భంగా ఇంద్రాసేన రెడ్డి పేర్కొన్నారు. రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ, విశ్రాంత అధ్యాపకులు ప్రొ.రమేష్ రెడ్డి, డా.విజయ్, శ్యాంమోహన్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణ చైతన్యకు డాక్టరేట్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ (సీఎస్‌ఈ) విభాగంలో ఎన్.కృష్ణ చైతన్యకు పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ లభించింది. ఎంజీఐటీ ప్రొఫెసర్ సీఆర్‌కే రెడ్డి పర్యవేక్షణలో రి యూజబుల్ కాంపొనెంట్ రిట్రీవల్ ఫ్రం ఆప్టిమైజ్డ్ రేపాజిటరీ యూజింగ్ న్యూరల్ నెట్వర్క్స్ అనే అంశం పై పరిశోధనకు డాక్టరేట్ డిగ్రీ పొందారు. కరీంనగర్ జిల్లా కోహెడ మండలం శనిగారం గ్రామానికి చెందిన కృష్ణ చైతన్య బాచుపల్లిలోని గోకరాజు రంగరాజు కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో కంప్యూటర్ సైన్స్ అధ్యాపకులుగా పని చేస్తున్నారు.

జియోఫిజిక్స్‌తో ఉపాధి అవకాశాలు

ఉస్మానియా యూనివర్సిటీ: జియో ఫిజిక్స్ కోర్సుతో ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని ఓయూ వీసీ ప్రొ.రవీందర్ అన్నారు. ఓయూ క్యాంపస్ సైన్స్ కాలేజీలో దివంగత ప్రొఫెసర్ బీవీఎస్ మూర్తి గోల్డ్ మెడల్ ఫర్ అకాడమిక్ ఎక్స్‌లెన్స్ ఆఫ్ జియోఫిజిక్స్ కార్యక్రమంలో భాగంగా మోడ్రన్ ట్రెండ్స్ ఇన్ గ్రావిటీ అండ్ మ్యాగ్నెటిక్ మెథడ్స్ అనే అంశం పై వర్క్‌షాప్ జరిగింది. ఈ కార్యక్రమానికి సైన్స్ కాలేజీ ప్రిన్సిపల్ ప్రొ.వీరయ్య అధ్యక్షత వహించగా వీసీ రవీందర్, దివంగత బీవీఎస్ మూర్తి సతీమణి డాక్టర్ సుమన్‌లత, సైన్స్ డీన్ ప్రొ.కరుణసాగర్, జీఎస్‌ఐ డైరెక్టర్ వి.రాంమూర్తి, డా.ఉదయ్ లక్ష్మీ పాల్గొని ప్రసంగించారు.

కోదండరామ్‌కు సన్మానం

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ జనసమితి అధినేత, ప్రొ.కోదండరామ్ అందరివాడని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్‌గౌడ్, కామర్స్ అధ్యాపకులు డాక్టర్ రామేశ్వర్ రావు అన్నారు. ఆదివారం కోదండరామ్ నివాసంలో ఆయనను ఓయూ అధ్యాపకులు, విద్యార్థి నేతలు సన్మానించి సమాజంలో అన్ని వర్గాల వారికి చేస్తున్న సేవలను కొనియాడారు. భువనగిరి ఎంపీ టికెట్‌ను తనకు ఇప్పించాలని చనగాని దయాకర్‌గౌడ్ బయో డేటాను సమర్పించగా, ఉద్యోగాలను పర్మనెంట్ చేయాలని డాక్టర్ రామేశ్వర్‌రావు వినతి పత్రం సమర్పించారు. ఈ నెల 13న ఓయూ ఆర్ట్స్ కాలేజీలో కోదండరామ్‌ను ఘనంగా సన్మానించనున్నట్లు పేర్కొన్నారు.

6న డీటీఎఫ్ రాష్ట్ర మహాసభ

రహమత్‌నగర్: యూసుఫ్‌గూడలోని మహమూద్ ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 6 నిర్వహించే డెమొక్రటిక్ జర్నలిస్ట్ ఫెడరేషన్ విజయోత్సవ రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని డీటీఎఫ్ స్టేట్ సెక్రటరీ మహ్మద్ నసీరుద్దీన్ ఖాద్రీ పిలుపునిచ్చారు. రహమత్‌నగర్‌లో ఆయన మాట్లాడుతూ... చిన్న పత్రికల యాజమాన్యాలు, విలేకరులు ఎదుర్కొంటున్న సమస్యలపై సభలో చర్చిస్తామన్నారు. ప్రధానంగా 339 జీఓ రద్దు, ఇతర సమస్యలపై వక్తలు ప్రసంగిస్తారని చెప్పారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జిల్లాల వారీగా అక్కడి సమస్యలు సభ దృష్టికి తీసుకొస్తామన్నారు. మధ్యాహ్నం రాష్ట్ర మంత్రుల ప్రసంగాలు ఉంటాయన్నారు. సాయంత్రం 5 గంటల వరకు సభ కొనసాగుతుందని ఖాద్రీ వివరించారు. డీటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రత్నాకర్, యాదగిరిల సారథ్యంలో జరిగే ఈ మహాసభలో కీలక నిర్ణయాలు తీసుకుంటామని ఖాద్రీ పేర్కొన్నారు.

క్రీడలతో పరిపూర్ణ ఆరోగ్యం

మంత్రి పొన్నం ప్రభాకర్

ఖైరతాబాద్: నెక్లెస్ రోడ్డులో సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షుడు అనిల్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ పార్లమెంట్ క్రికెట్ లీగ్ నాకౌట్ మ్యాచ్ (ఎస్‌పీసీఎల్) పోటీలను మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదివారం ప్రారంభించారు. అనంతరం ట్రోఫీలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ... క్రికెట్ పోటీల ద్వారా టాలెంట్‌ను నిరూపించుకునేందుకు మంచి అవకాశమన్నారు. యువత సన్మార్గంలో సాగుతూ సమాజం పట్ల అవగాహన ఉండాలన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉంటూనే క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడలు శరీరానికి మాత్రమే కాకుండా మానసికంగా కూడా ఎంతగానో దోహదపడతాయన్నారు. క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్న సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షుడు అనిల్‌కుమార్ యాదవ్‌ను మంత్రి అభినందించారు. ప్రతి నియోజకవర్గం నుంచి 40–50 జట్లు పాల్గొంటాయని, మొదటి ప్రైజ్ మనీగా రూ. 2 లక్షలు, రన్నరప్‌కి రూ. లక్ష ఉంటుందన్నారు. 5వ తేదీ నుంచి నియోజకవర్గాల వారీగా, ఆ తరువాత పార్లమెంట్ నియోజకవర్గ స్థాయిలో, ఆపై ఫైనల్స్ ఉంటాయని అనిల్‌కుమార్‌యాదవ్ వివరించారు. మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్, నిర్వాహకులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

విదేశాల్లో విద్యావకాశాలపై అవగాహన

బంజారాహిల్స్: విదేశాల్లోని ప్రముఖ విశ్వవిద్యాలయాల్లోని కోర్సులు, విద్యావకాశాలు, పలు ఎంట్రెన్స్ టెస్టులలో చేయాల్సిన స్కోర్స్‌లాంటి వాటి గురించి విద్యార్థులు వారి తల్లిదండ్రులు తెలుసుకొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. శనివారం బంజారాహిల్స్‌లోని తాజ్‌డెక్కన్‌లో ఐవీవై ఓవర్సీస్ ఆధ్వర్యంలో గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయి ర్–2024 పేరిట ఉచిత అవగాహన సదస్సును నిర్వహించారు. సుమారు 1000 మంది విద్యార్థులతో పాటు ఆయా యూనివర్సిటీల ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరయ్యారు. ప్రముఖ దేశాలైన యూఎస్‌ఏ, ఆస్ట్రేలియా, యూకే, కెనెడా, న్యూజిలెండ్, ఐర్లాండ్ వంటి దేశాల్లో విద్యావకాశాలు, ఆయా యూనివర్సిటీల స్థితిగతుల గురించి విద్యార్థులు అడిగి తెలుసుకొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఇలాంటి అవగాహనా సదస్సుల ద్వారా విద్యార్థులకు విదేశాల్లో ఉన్నత విద్యావకాశాలను గురించి తెలుసుకోవడానికి చాలా ఉపయుక్తంగా ఉంటుందని ఐవీవై ఎండీలు గిరి శ్రీనివాసరావు బొంగరాల, రామ్ బొంగరాల తెలిపారు. సేల్స్ హెడ్ శివశంకర్, సిబ్బంది పాల్గొన్నారు.